
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 14 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో గురువారానికి 26.037 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 254 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,160
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,493
3 శాతం జీఎస్టీతో	రూ.5,658
నవర (8 గ్రా)	రూ.45,264

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /25.7

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలిలో 66 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

డైట్‌లో టీచర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమేష్

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు డైట్‌లో గురువారం 'మ్యాజిక్ బస్ అకాడమీ' ఆధ్వర్యంలో టీచర్లకు జీవన నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కోర్స్ డైరెక్టర్, డైట్ ప్రిన్సిపల్ పి.రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ, ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ మూడురోజులపాటు జరుగుతుందన్నారు. 400 మందికి పైగా విద్యార్థులున్న పాఠశాలల నుంచి ఒక వ్యాయామ, ఒక ఔత్సాహిక ఉపాధ్యాయుడు హాజరైనట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.వెంకటేశ్వరరావు, ఆర్పీలు బోయ దాసు, విజయ చంద్ర, నరసింహారావు పాల్గొన్నారు.

తప్పు చేస్తే కఠిన చర్యలు

- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌కుమార్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఉదయగిరి: 'విద్యార్థులు, మహిళలకు నాణ్యతతో కూడిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది. ఆహారం పంపిణీ విషయంలో తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.' అని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం ఆయన సివిల్ సప్లైస్, ఐసీడీఎస్, వెల్ఫేర్ హాస్టల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసే అన్ని సరుకులు లబ్ధిదారులకు పక్కాగా అందాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును టీచర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. తొలుత మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలు తనిఖీ చేశారు. విద్యార్థులు, లబ్ధిదారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో జూన్ 12వ తేదీ నుంచి డిగ్రీ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో 427 మంది విద్యార్థులకు గాను 377 మంది హాజరయ్యారు. 50 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, వీఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరిని డిబార్ చేశారని తెలియజేశారు.

777 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం రైతుల నుంచి రూ.2.45 కోట్లకు పొగాకు కొనుగోలు చేశారని వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ తెలిపారు. మొత్తం 824 బేళ్లను రైతులు వేలానికి తీసుకురాగా అందులో 777 బేళ్లను కొనుగోలు చేశారని తెలియజేశారు. కిలోకు అత్యధికంగా రూ.245, అత్యల్పంగా రూ.150, సగటున రూ.236.28 ధర నమోదైందన్నారు.


730 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో అక్రమంగా నిల్వ ఉంచిన 730 కేజీల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. గ్రామానికి చెందిన గౌస్ అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి సివిల్ సప్లయిస్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సివిల్ సప్లైస్ తహసీల్దార్ కృష్ణప్రసాద్, డీటీ మురళి పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగ ప్రాప్తి



ఉన్నత చదువు.. ఒకప్పుడు ఇది అనేక మంది యువతకు అందని ద్రాక్ష. అయితే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం లక్షలాది మంది కలల్ని సాకారం చేసింది. కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో విప్లవం తెచ్చారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తూ ఆర్థిక భారం లేకుండా చేశారు.



- జగనన్న తోటలో విరిసిన విద్యా కుసుమాలు
- ఆటంకం లేకుండా విద్యా, వసతిదీవెన అమలు
- గత ప్రభుత్వ పెండింగ్‌ను క్లియర్ చేసిన జగన్ సర్కార్
- జిల్లాలో ఏడాదికి లక్ష మందికి పైగా లబ్ధి
- చదువుకుని ఉద్యోగాలు సాధిస్తున్న విద్యార్థులు



విద్యాదీవెన జనవరి - ఫిబ్రవరి - మార్చి - 2023 త్రైమాసికానికి సంబంధించి నెల్లూరులో విద్యార్థినులకు భారీ నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్ (ఫైల్)

నెల్లూరు(వేదాయపాళెం): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో పేద విద్యార్థులు ఉన్నత విద్యావంతులవుతున్నారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టే సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలయ్యేది. అయితే కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్–1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేలు వరకు ఉండేది. ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలు మినహాయించి మిగిలిన ఫీజు విద్యార్థుల తల్లిదండ్రులు చెల్లించాల్సి వచ్చేది. పాదయాత్ర సమయంలో అనేకమంది ఆర్థిక ఇబ్బందులను చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకంలో మార్పులు తెచ్చారు. నగదు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా జగనన్న విద్యా దీవెన ద్వారా విశ్వవిద్యాలయాలు నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్య పూర్తి చేసి జీవితంలో స్థిరపడుతూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

తల్లుల బ్యాంక్ ఖాతాల్లో..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు జగనన్న విద్యా, వసతిదీవెన పథకాల కింద అక్షరాల ప్రతి ఏడాది సగటున 1.10 లక్షల మందికి పైగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.575 కోట్లకు పైగా జమ చేసింది.

నియోజకవర్గం	విద్యా దీవెన		వసతి దీవెన	
	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)
ఆత్మకూరు	11,767	37.03	17,572	19.94
కందుకూరు	12,528	18.68	12,159	11.87
కావలి	12,001	58.14	12,201	23.97
కోవూరు	12,527	51.35	18,970	24.26
నెల్లూరు సిటీ, రూరల్	29,286	109.47	30,639	54.18
సర్వేపల్లి	11,283	42.25	24,074	23.51
ఉదయగిరి	14,595	38.20	23,396	22.92
వెంకటగిరి	5,503	26.79	13,403	13.31
(సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలు)	1,09,490	381.91	1,52,414	193.96

వదిలేసిన టీడీపీ

టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గాలికొదిలేసింది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసినా పట్టించుకోలేదు. 2017 – 18, 2018 – 19 విద్యా సంవత్సరాల్లో చంద్రబాబు ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఫీజును కూడా ప్రస్తుతం 2019 – 20 విద్యా సంవత్సరంలో విడుదల చేసింది. జిల్లాలో 42,192 మంది విద్యార్థులకు సంబంధించిన అరియర్స్‌ను అందజేశారు.

టీసీఎస్‌లో ఉద్యోగం వచ్చింది



మా నాన్న వ్యవసాయం చేస్తుంటారు. కరోనా కష్టకాలంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా, వసతిదీవెన నిధులు విడుదల చేయడంతో నాలాంటి ఎంతో మంది విద్యార్థులకు ఉపయోగపడింది. ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశా. వెంటనే ఏడాదికి రూ.7 లక్షల ప్యాకేజీతో టీసీఎస్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోంది.

– పి.సాయికుమార్‌రెడ్డి, వెంకట్రావుపల్లి, ఆత్మకూరు నియోజకవర్గం

సంతోషంగా ఉంది



మా నాన్న వ్యవసాయం చేస్తుంటారు. నేను విద్యా, వసతిదీవెన పథకాలతో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చేశాను. చివరి ఏడాది కూడా నిధులు విడుదలయ్యాయి. టెక్ మహీంద్ర కంపెనీలో ఏడాదికి రూ.4 లక్షల ప్యాకేజీతో జాబ్ వచ్చింది. చదువు అయిపోవడంతోనే ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. కుటుంబ సభ్యులు ఆనందంగా ఉన్నారు.

– ఎస్.సాయి హర్షిత, కనుపర్తిపాడు, నెల్లూరు రూరల్

కల నెరవేరింది



మా నాన్న వ్యవసాయం చేస్తుంటారు. ఇంజినీరింగ్ చదవాలనే నా కలను జగనన్న నెరవేర్చారు. ప్రభుత్వం విడుదల చేసిన విద్యాదీవెన, వసతిదీవెన నిధులతో చదివిన నేను టెక్ మహీంద్ర కంపెనీలో ఉద్యోగం సంపాదించడం ఎంతో సంతోషంగా ఉంది. ఏడాదికి రూ.3 లక్షల ప్యాకేజీ. దీనికి కారణమైన జగనన్నకు రుణపడి ఉంటాం.

– టి.శరణ్య, సౌత్‌రాజుపాళెం, నెల్లూరు రూరల్

రుణపడి ఉంటాం



నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద కూతురు రేష్మ గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ చదువుతోంది. చిన్న పాప కూడా ఇంటర్ పూర్తి చేసింది. పిల్లల చదువుకు జగనన్న విద్యా దీవెన, వసతిదీవెన, అమ్మఒడి పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. దీంతోపాటు ప్రభుత్వం అందించే ఆసరా, చేదోడు పథకాల వల్ల లబ్ధి పొందాను. ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– ఎం.విజయకుమారి, తల్లి

నిధులు జమయ్యాయి



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్న విద్యాదీవెన మొత్తాలను సంబంధిత కళాశాలల్లో నిర్దేశ సమయంలో చెల్లిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. విద్యా, వసతిదీవెన పథకాలకు సంబంధించి ఎలాంటి సమస్యలొచ్చినా పరిష్కరించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు, మా కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఈ నాలుగేళ్లలో విద్యావసతి దీవెన కింద మొత్తం రూ.575 కోట్లు తల్లుల ఖాతాల్లో జమయ్యాయి.

– కె.రమేష్, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి

హాయి హాయిగా..

'ఎలక్ట్రిక్ బస్సు భలే ఉంది. ఒక్కసారి ఎక్కి చూద్దాం..' వాటిని చూసిన ప్రయాణికులు ప్రస్తుతం ఇదే మాట చెబుతున్నారు. ఇప్పటికే ఎక్కిన వారు మరోసారి ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు నుంచి తిరుపతికి ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. ఓ వైపు పర్యావరణ పరిరక్షణ.. మరోవైపు సౌకర్యవంతమైన ప్రయాణం.. వెరసి నెలరోజుల్లో అనేకమంది ప్రయాణించి బస్సులు బాగున్నాయంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తిరుపతికి వెళ్లేందుకు ఎలక్ట్రిక్ బస్సు ఎక్కిన ప్రయాణికులు

- ఎలక్ట్రిక్ బస్సుల్లో సంతృప్తికరంగా ప్రయాణం
- గత నెలలో నెల్లూరు నుంచి 12 బస్సుల ప్రారంభం
- క్రమంగా పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య

నెల్లూరు సిటీ: నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నుంచి తిరుపతికి 12 ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం గతనెల 9వ తేదీన ప్రారంభించింది. రోజూ ఉదయం 5 గంటల నుంచి ఇవి మొదలవుతాయి. ప్రతి గంటకు ఒక బస్సు తిరుపతికి అందుబాటులో ఉంటుంది. రాత్రి 8.45 గంటలకు చివరి బస్సు ఉంటుంది. ఒక్కో దాంట్లో 35 సీట్లు ఉంటాయి. పెద్దలకు రూ.350, చిన్నారులకు రూ.270 చొప్పున వసూలు చేస్తున్నారు. చార్జింగ్ ఒక్కసారి పెడితే 220 కి.మీ వరకు బస్సు ప్రయాణం సాగుతుంది.

సీసీ కెమెరాల ఏర్పాటు

బస్సు ముందు వైపు రెండు, వెనుక ఒకటి, డ్రైవర్ క్యాబిన్‌లో ఒకటి చొప్పున మొత్తం నాలుగు సీసీ కెమెరాలున్నాయి. సౌకర్యవంతమైన ప్రయాణం కోసం బస్సులో అనేక వసతులు కల్పించారు. ఏసీ ఏర్పాటు చేశారు. దీంతో ఎండ తీవ్రత బెడద ఉండదు. బస్సులో ఒక లైన్‌కు చార్జింగ్ కనెక్షన్లు ఇచ్చారు. ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకునేందుకు వీలు కల్పించారు. నెల్లూరు నుంచి తిరుపతికి ప్రస్తుతం మూడు గంటల్లో గమ్యస్థానానికి చేరుకోవచ్చు. నాయుడుపేట మార్గంలో జాతీయ రహదారి పనులు సాగుతున్నాయి. ఆ పనులు పూర్తయితే 2.40 గంటల్లోనే వెళ్లిపోవచ్చు.

ప్రయాణం బాగుంది



నెల్లూరు నుంచి తిరుపతికి కుటుంబ సభ్యులతో ప్రయాణాలు చేస్తుంటాను. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఎలక్ట్రిక్ బస్సుల్లో వెళ్లడం చాలా బాగుంది. అన్ని వసతులు కల్పించారు. బస్సులో ఏర్పాట్లను బట్టి టికెట్ ధర న్యాయమైనదే.

– అరుణ్ కిశోర్, నవాబుపేట

ఏసీ బస్సులు పెట్టడం సంతోషం



ప్రతి ఏడాది కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరు నుంచి తిరుపతికి ప్రయాణం చేస్తుంటాం. ఎలక్ట్రిక్ బస్సుల్లో ఏసీ ఏర్పాటు చేయడం ద్వారా వృద్ధులు, చిన్నారులు హాయిగా ప్రయాణించవచ్చు. గతంతో పోలిస్తే తిరుపతికి త్వరగా వెళ్తున్నాం.

– గాయత్రి, నెల్లూరు

సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు



ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాకు కూడా బస్సు నడపడం సులువుగా ఉంది. నెల్లూరు నుంచి తిరుపతికి ప్రయాణం మూడు గంటలు పడుతోంది. అలిపిరి, నెల్లూరు బస్టాండ్‌లలో చార్జింగ్ పాయింట్స్ ఉన్నాయి. ఫుల్ చార్జింగ్ చేస్తే 220 కి.మీ వస్తుంది.

– శశికుమార్, ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్

స్పందన వస్తోంది



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టింది. ప్రయాణికుల కోసం అన్ని సదుపాయాలు కల్పించారు. ఈ నెల రోజుల్లో మంచి స్పందన వచ్చింది. ఎటువంటి ఫిర్యాదులు రాలేదు.

– శివకేశవ్, నెల్లూరు–2 డిపో మేనేజర్

యాజమాన్య హక్కులపై హర్షం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

కావలి: రాష్ట్రంలోని సుమారు 46,935 మంది రైతులకు 54,129 ఎకరాలపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు కేబినెట్‌లో ఆమోదం తెలపడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు గురువారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీఎంకు మద్దతుగా నినాదాలు చేశారు.

క్యాంప్‌డే రోజే లబ్ధిదారులకు సర్టిఫికెట్లు

- కలెక్టర్ హరినారాయణన్



తహసీల్దార్‌కు సూచనలిస్తున్న కలెక్టర్

కొడవలూరు: క్యాంప్‌డే రోజునే లబ్ధిదారులందరికీ సర్టిఫికెట్లు అందించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. మండలంలోని గండవరంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌డేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాంప్‌డే రోజునే అన్ని సర్టిఫికెట్లను అందించాలని స్పష్టంగా ఆదేశించినా జాప్యం చేయడమేమిటని ప్రశ్నించారు. సాయంత్రంలోగా ప్రతి లబ్ధిదారుకు సర్టిఫికెట్లు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో మంజూరు చేస్తామని స్పష్టంగా చెప్పాల్సి ఉన్నా ఎలాంటి సమాధానం ఇవ్వకుండా ఉండిపోవడమేమిటని రెవెన్యూ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని, ఈ కార్యక్రమంపై నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీటీసీ పెనాక శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ రాజకుమారి, పంచాయతీ కార్యదర్శులు బ్రహ్మానందరెడ్డి, డి.సురేష్‌కుమార్, వీఆర్వోలు దుర్గాప్రసాద్, ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, సత్యం యాదవ్ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు చర్యలు

మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలను కలెక్టర్ హరినారాయణన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురై ఉండగా, మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన స్టోర్ రూమ్, గురుకులం పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట గురుకులం ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ జి.మస్తానయ్య, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

వెంగమాంబకు నెల పొంగళ్లు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారికి గురువారం నెల పొంగళ్లను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అలాగే కొందరు హోమగుండంలో ఎండుకొబ్బరి సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పొంగలి తయారు చేస్తున్న మహిళ



హోమగుండం వద్ద భక్తులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రజాసమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష లక్ష్యమని నెల్లూరు ఎంపీ, రూరల్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 18,29 డివిజన్‌లలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వంలో సాంకేతిక కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని విన్నవించిన వారి సమస్యలకు ప్రస్తుతం పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకితభావంతో సేవలందిస్తున్నారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. వ్యవస్థలో ఒకరిద్దరు తప్పులు చేసి ఉంటే వారిని మాత్రమే విమర్శించాలని, అందర్నీ విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు అశోక్, సత్తార్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు రక్ష

• ఎంపీ బీద మస్తాన్‌రావు

అల్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమం సంక్షేమ పథకాలు పొందేందుకు పేదలకు రక్షణగా నిలుస్తుందని ఎంపీ బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బీద మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా సాంకేతిక సమస్యలను పరిష్కరించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నేరవేర్చిన పాపాన పోలేదన్నారు. ఇస్కపల్లి అభివృద్ధికి బీద మస్తాన్‌రావు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జగనన్న కాలనీకి తన సొంత నిధులతో పొలం కొనుగోలు చేసి ఇవ్వడం అభినందనీయమన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి జగనన్నను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ వేణమ్మ, ఎంపీపీ శిరీష, సర్పంచ్ రంజిత్, వైస్ఎంపీపీ కొండూరు వాసు, వైస్ఏఎంసీ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, కొండూరు శీనయ్య, ఉస్మాన్, బీద మహీధర్, దేవరాల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ బీద, ఎమ్మెల్యే రామిరెడ్డి

దగదర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

• గ్రావెల్ తవ్వకాల అడ్డగింతపై టీడీపీ నాయకుల హల్‌చల్
• సీజ్ చేసిన వాహనాలను వదిలేయాలని డిమాండ్

కావలి(దగదర్తి): దగదర్తి పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రావెల్ అక్రమ తవ్వకాల అడ్డగింతపై టీడీపీ నాయకుడు మాలెపాటి సుబ్బానాయుడు తన అనుచరులతో స్టేషన్ వద్ద సుమారు గంటకు పైగా హల్‌చల్ చేశాడు. సీజ్ చేసిన వాహనాలు వెంటనే వదిలేయాలని డిమాండ్ చేస్తూ నానా హంగామా సృష్టించాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. దగదర్తి మండలం అనంతవరం సమీపంలోని ఏపీఐఐసీ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారని రెండ్రోజుల క్రితం అధికారులకు వరుసగా ఫిర్యాదులు అందాయి. దీంతో రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలను పరిశీలించి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేశారు. పోలీసుల సాయంతో సీజ్ చేసిన వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సుబ్బానాయుడు తన అనుచరులతో కలిసి గురువారం స్టేషన్ వద్దకు చేరుకుని హల్‌చల్ చేశాడు. తవ్వకాలు చేపడుతున్న భూములు ఏపీఐఐసీవి కాదని, ప్రైవేట్ భూములని అధికారులపై ధ్వజమెత్తారు. సీజ్ చేసిన వాహనాలను వెంటనే వదిలేయాలని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న కావలి రూరల్ సీఐ రాజేష్ దగదర్తి స్టేషన్‌కు చేరుకుని టీడీపీ నాయకులకు పరిస్థితిని వివరించారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారుల సూచనలతో వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. రైతుల అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతామని సామరస్యంగా వ్యవహరించి పరిస్థితిని చక్కదిద్దారు.

సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు

నెల్లూరు(బృందావనం): దైవసన్నిధిలో జీవితాలను సాగించే అర్చకుల మదిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వతంగా నిలిచిపోతారని బ్రాహ్మణ సంఘం నేతలు మువ్వ ప్రసాద్, పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని సంఘ కార్యాలయంలో గురువారం వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వర్గంలో దేవాదాయశాఖ పరిధిలో పనిచేస్తున్న అర్చకులకు వంశపారంపర్య హక్కులు, జీతాలు, వయోపరిమితి పెంపు వంటి సంక్షేమ కార్యక్రమాలకు తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తమ జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. బ్రాహ్మణులు అర్చక వృత్తికి దూరమవుతున్న సమయంలో సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని, ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జంగా శ్రీను, రాజేష్, శ్రావణ్, బాలాజీ, నరేష్, గోపాల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘ నేతలు మువ్వ ప్రసాద్, శంకర్ తదితరులు

శవమై తేలిన అదృశ్యమైన మహిళ

• పూడ్చిపెట్టిన మృతదేహం వెలికితీత
• హత్యగా కేసు నమోదు



ప్రతిమ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: గత నెల 26న ఇంటి నుంచి అదృశ్యమైన పెనుబల్లికి చెందిన నన్నెం ప్రతిమ(40) శవంగా తేలింది. జొన్నవాడ పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న భూముల్లో పూడ్చిపెట్టిన శవాన్ని తహసీల్దార్ సుధీర్, సీఐ రామారావు గురువారం వెలికితీయించి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు..పెనుబల్లికి చెందిన నన్నెం ప్రతిమను ఏఎస్‌పేటకు చెందిన మేనమామకు ఇచ్చి వివాహం చేశారు. భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వచ్చి తల్లి వద్దే ఉంటోంది. ఆమె చెల్లెలు ప్రత్యూష దంపతులు సైతం ఇక్కడే ఉంటున్నారు. గత నెల 26న ప్రతిమ ఇంటి నుంచి అదృశ్యమవడంతో ప్రత్యూష బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి జొన్నవాడలోని పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న భూముల్లోకి బహిర్భూమికి వెళ్లిన కొందరు దుర్గంధం రావడాన్ని గుర్తించి పెనుబల్లి గ్రామస్తులకు సమాచారం అందజేశారు. దీంతో అక్కడకు వెళ్లిన ప్రత్యూష తన అక్క చున్నీ, గాజులు, చెప్పులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రామారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గురువారం రెవెన్యూ అధికారులు, ఫోరెన్సిక్ వైద్యులతో ఘటనా స్థలానికి చేరుకుని పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండడంతో అక్కడే శవ పరీక్షలు నిర్వహించారు. ప్రతిమను హత్య చేసి పూడ్చిపెట్టి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రతిమను ఎవరు చంపారు.. ఎందుకు చంపారు అనే కోణంలో కేసు విచారణ చేయనున్నట్లు చెప్పారు. ప్రతిమ వాడుతున్న సెల్‌ఫోన్ ఆధారంగా త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. సీఐ వెంట ఎస్ఐ వీరప్రతాప్, తదితరులు ఉన్నారు.



ప్రతిమ మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు

పొదలకూరు నిమ్మధరలు (కిలో)
పెద్దవి: రూ.25
సన్నవి: రూ.12
పండ్లు: రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	120
లేయర్ (లైవ్) :	92
బ్రాయిలర్ చికెన్ :	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	234
లేయర్ చికెన్ :	156

● యంగ్ టాలెంట్

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది ఢిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. ఢిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'


సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాశీ కాశీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

● ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.

● సక్సెస్ స్టోరీ



తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్

స్టార్ ఫ్యాషన్ డిజైనర్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతివృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్‌ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

● టెక్.. టాక్

హువావే నోవా 11 ప్రో



● డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ● రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ ● బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ ● ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ ● ర్యామ్: 8జీబి ● రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ ● ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి ● ఆపరేటింగ్ సిస్టమ్: హార్మని ఓఎస్ ● బరువు: 188 గ్రా. ● కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్

నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్



● డిస్‌ప్లే: 1.4 అంగుళాలు ● ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ ● హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 120 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16x10x4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్స్
మెటీరియల్: అల్యూమినియం
బరువు: 240 గ్రా.

గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...



ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లెటౌట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

● గేమింగ్: నేడే విడుదల

వస్తున్నారహో!



ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్‌ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్


పూజా హెగ్డే
రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి, పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగవంశితో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశి, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.


అనుష్కా శర్మ


కియారా అద్వానీ

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.


మీనాక్షీ చౌదరి
శ్రీలీల


కత్రినా కైఫ్


ప్రియాంకా చోప్రా

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.


ఆలియా భట్


'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ


● విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ


● అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్ఛాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్


● సయ్యద్ సోహైల్, రూపా కొడవాయూర్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయూర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

- ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తీ సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ-''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.